# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 07 జనవరి 2026 www.balagamtv.com పేజీలు 4


## ఆర్టీసీలో 198 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ

- 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ఎల్‌పీఆర్‌బీ విజ్ఞప్తి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఆర్టీసీలో 198 ట్రాఫిక్, మెకానిక్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మెన్ వివి. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. నేరుగా రిక్రూట్‌మెంట్ జరుగుతున్న ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఎల్‌పీఆర్‌బీ.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. తమ వెబ్‌సైట్లో ఈ పోస్టులకు అవసరమైన విద్యార్హతలు, కావాల్సిన సర్టిఫికెట్ల గురించి వివరాలిచ్చామని తెలిపారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

### హిల్ట్ పాలసీతో

## నివాస ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం

- హైదరాబాద్‌లోని భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు
- పారిశ్రామిక వ్యర్థ రసాయనాలే దీనికి కారణం
- నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తాం
- ఈ పాలసీ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలను పక్కన పెట్టాలి
- మంత్రులు భూ యజమానులు కాదు.. ప్రభుత్వంలో ఉన్న ట్రస్టీలు మాత్రమే
- పారిశ్రామికవేత్తల ఇష్టప్రకారమే ల్యాండ్ కన్వర్షన్
- వద్దనుకుంటే దరఖాస్తు చేసుకోవద్దు
- అసెంబ్లీలో 'హిల్ట్' పత్రం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయనీ, పారిశ్రామిక వ్యర్థ రసాయనాలే దీనికి కారణమని రాష్ట్ర పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికీ మేల్కోకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అనుమతితో 'హైదరాబాద్ పారిశ్రామిక భూవినియోగ మార్పిడి విధానం' (హెచ్ఐఎల్‌టీ) పై విధాన పత్రాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హిల్ట్ విధానం, దాని లక్ష్యం, ప్రజలు, ప్రభుత్వానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతుందని చెప్పారు. హైదరాబాద్ సిటీలోని పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) అవతలివైపునకు తరలిస్తామని చెప్పారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని గుర్తు చేశారు. జీడీమెట్ల, ఉప్పల్, సనత్‌నగర్, చర్లపల్లి ప్రాంతాలు గతంలో ఇండస్ట్రియల్ జోన్లుగా జనావాసాలకు దూరంగా ఉండేవనీ, 50 ఏండ్లల్లో హైదరాబాద్ మహానగరంగా విస్తరించి, శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీలుగా మారాయని చెప్పారు. ఇప్పుడు అక్కడ లక్షలాది మంది పౌరులు నివసిస్తున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం పరిశ్రమలకు పక్కనే అపార్ట్‌మెంట్లు వెలిసాయనీ, అక్కడి ప్రజలు ఇప్పటికే కాలుష్యకష్టాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఇండస్ట్రీలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్ జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ వంటి దుర్ఘటనలు జరిగాయని ఉదహరించారు. హిల్ట్ పాలసీ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలను పక్కనపెట్టాలని కోరారు. చైనాలో భూస్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం నుంచి అవతలకు తరలించారని చెప్పారు. తద్వారా ప్రపంచదేశాలకు చైనా ఆదర్శంగా నిలిచిందన్నారు. పారిశ్రామిక ప్రగతి కంటే ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఢిల్లీలో జనావాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు. ఈ తీర్పు ప్రాతిపదికగా హిల్ట్ విధానం తీసుకొచ్చామన్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదన్నారు. పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని మనకు వారసత్వంగా అందించారనీ, మనం కూడా రేపటితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. దానికోసమే హిల్ట్ పాలసీ తెచ్చామన్నారు. ప్రతిపక్షాలు హిల్ట్ పాలసీని సాదాసీదా భూ మార్పిడిగా చూస్తున్నారనీ, కానీ దీని పరిధి చాలా విస్తృతమైందని వివరించారు. హిల్ట్ విధానంపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. జీవో నెంబరు 19కి సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చిందనీ, స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకు వస్తే కొంత ఫీజు తీసుకుని ల్యాండ్ కన్వర్షన్ చేస్తామన్నారు. 2013లోనే రెడ్, ఆరెంజ్ పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రులు భూ యజమానులు కాదనీ, ప్రభుత్వంలో ఉన్న ట్రస్టీలు మాత్రమేనని చెప్పారు. భూ మార్పిడిపై బలవంతం ఏమీలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ఇష్టమైతేనే భూ మార్పిడి చేస్తామని వివరించారు. విధానం బయటకు రాకముందే ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయనీ, ఆ పద్ధతి మార్చుకోవాలనీ, ఇప్పటికైనా పర్యావరణ విధ్వంసం ఆగాలని అన్నారు.

## తెలంగాణ రైజింగ్-2047 భవిష్యత్ తరాలకు దిశా నిర్దేశం

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



తెలంగాణ రైజింగ్-2047 విధాన పత్రాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పత్రం భవిష్యత్ తరాలకు దిశా నిర్దేశం చేస్తుందని చెప్పారు. దీనిపై అనేక వేదికలపై చర్చలు జరిగాయనీ, ప్రజల ఆమోదంతో తుది పత్రం రూపకల్పన జరిగిందన్నారు. 1991 నుంచి ప్రతి దశాబ్దంలో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి రెట్టింపు అవుతున్నదనీ, ప్రస్తుతం రాష్ట్రం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. ఇదే ఆర్థిక వేగం కొనసాగితే 2047 నాటికి సహజంగానే 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ఆర్థికవేత్తలు చెబుతున్నారని వివరించారు. కానీ రాష్ట్రంలోని ప్రతి రైతు, దళితులు, గిరిజనులు, ప్రతి మహిళను అభివద్ధిలోకి తీసుకురావడానికి అది సరిపోదన్నారు.

## శాసనసభ నిరవధిక వాయిదా

- ఐదు రోజుల్లో 40 గంటల 45 నిమిషాల పాటు చర్చ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. ఐదు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో 40 గంటల 45 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చ జరిగిందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సభలో 66 మంది సభ్యులు మాట్లాడారని, 13 బిల్లులు, నాలుగు లఘు చర్చలు జరిగినట్టు ప్రకటించారు. శాసనసభలో రెండు తీర్మానాలు చేసినట్టు వెల్లడించారు.

## కవిత రాజీనామా ఆమోదం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాను శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజక వర్గంనుంచి ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమెను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్‌చేసిన తర్వాత ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబర్‌లో ఆమె తన రాజీనామా పత్రం మండలి చైర్మెన్‌కు ఇచ్చారు. చివరిసారిగా ఆమె మండలిలో సోమవారం భావోద్వేగంగా మాట్లాడిన విషయం తెలిసిందే.ఈ మేరకు ఈసీకి నోటిఫికేషన్ అసెంబ్లీ కార్యదర్శి పంపారు.

## పాలనపై అవగాహన లేని ముఖ్యమంత్రి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జనగామలో సర్పంచుల అభినందన సభ



**బలగం టీవి, జనగామ**

జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి పరిపాలనపై అవగాహన లేదని, ప్రజలను మభ్యపెట్టడం తప్ప ఇంకేమీ చేయడం లేదని ఆరోపించారు. నీటి వనరులపై కనీస అవగాహన లేకుండానే కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. భాక్రా నంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెప్పే స్థాయికి సీఎం వ్యాఖ్యలు దిగజారాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని కేటీఆర్ అన్నారు. రైతులు యూరియా కోసం చలిలో లైన్లలో నిలబడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎనకటి రోజులు తెస్తాం' అన్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని ఆరోపించారు. గ్రామాల్లో సీఎం పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు.

తెలంగాణను 60 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ దోపిడీ చేసిందన్న చరిత్రను మరిచి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి ఉద్యమించి తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై అడ్డగోలుగా విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ నీళ్లు, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతు బీమా, సాగునీటి ప్రాజెక్టులు అమలయ్యాయని గుర్తు చేశారు. దేశంలోనే పంటల ఉత్పత్తిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడిని విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్యానించారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు పెంపు, కౌలుదారులకు సాయం, ప్రతి పంటకు బోనస్, రెండు లక్షల ఉద్యోగాల వంటి హామీలతో రైతులు, యువతను మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతను ఆశలతో మభ్యపెట్టి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించారని విమర్శించారు. మహిళల సంక్షేమంపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు, ఆర్థిక భరోసా ఇవ్వలేని ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ ప్రకటనలు చేయడం విడ్డూరమన్నారు.

రేవంత్ రెడ్డి వ్యవహార శైలి పట్ల కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన ప్రవర్తనలో మార్పు లేదని, ప్రజల్లో అయోమయం నెలకొందన్నారు. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌తోనే కాంగ్రెస్ నేతలు ఆగమాగం అవుతున్నారని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలన్న సంకల్పంతో కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. సర్పంచులు మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ కోసం కృషి చేయాలని కోరారు. జనగామ ర్యాలీని చూసి కేసీఆర్ ఇప్పటికే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన భావన కలిగిందని కేటీఆర్ అన్నారు. గులాబీ జెండా కనిపిస్తే ప్రజలు చప్పట్లు కొడుతున్నారని, ప్రజలు మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కసితో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి వంటి మహనీయులు జన్మించిన ఈ గడ్డపై బీఆర్ఎస్ మరింత బలంగా నిలబడుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## తిరుప్పరకుండ్రం ఆలయంలో కార్తీక దీపం వెలిగించుకోవచ్చు

### మద్రాసు కోర్టు మదురై బెంచ్

**బలగం టీవి, చెన్నై**

తిరుప్పరకుండ్రం ఆలయంలో దీపస్తంభంపై గల కార్తీక దీపం వెలిగించుకోవడానికి సుబ్రమణ్యస్వామి ఆలయ మేనేజ్‌మెంట్‌కు అనుమతినిస్తూ జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్ ఇచ్చిన ఆదేశాలను మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ మంగళవారం సమర్థించింది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ అక్కడ దీపం వెలిగిస్తే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని తమిళనాడు ప్రభుత్వం భయాందోళనలు వ్యక్తం చేయడాన్ని హాస్యాస్పదమంటూ జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కె.కె.రామకృష్ణన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. ఆగమ శాస్త్రం ప్రకారం కొత్తగా ఈ స్తంభం వద్ద దీపాన్ని వెలిగించుకోవడానికి అనుమతించరాదనేందుకు అప్పీలుదారులు ఎలాంటి బలమైన ఆధారాలను చూపలేదని కోర్టు పేర్కొంది. కానీ ఆలయ ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం దీపం వెలిగించడానికి కారణాలు వున్నాయని కోర్టు తెలిపింది. ఆలయ మేనేజ్‌మెంట్ దీపం వెలిగించాలని, జిల్లా యంత్రాంగం ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కోర్టు పేర్కొంది. అయితే అది పురావస్తు నిర్మాణమైనందున భారత పురావస్తు విభాగం దాన్ని పరిరక్షించేందుకు కొన్ని షరతులను విధించవచ్చని పేర్కొంది.

## ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్యాయత్నం

- నారాయణపేట జిల్లా మరికల్ పరిధిలో ఘటన

**బలగం టీవి, నారాయణపేట**

భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి.. ఆ తర్వాత తండ్రి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధి తీలేరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. తిలేరు గ్రామానికి చెందిన చాకలి శివరాములు దంపతులకు ఇద్దరు పిల్లలు రిత్విక(8), చైతన్య(6). అయితే కుటుంబంలో మనస్పర్థల వల్ల ఆయన భార్య కాపురానికి రావడం లేదు. దాంతో మనస్తాపానికి గురైన శివరాములు మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి మృతదేహాలను గ్రామ శివారులో ఉన్న కోయిల్‌సాగర్ కాల్వలో పడేశాడు. ఆ తర్వాత ఆయన గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఉప సర్పంచ్ అశోక్‌కుమార్ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాము వెంటనే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి కాల్వలో నుంచి పిల్లల మృతదేహాలను బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికు తరలించారు. శివరాములు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ మురారి, ఉపసర్పంచ్ అశోక్ కుమార్, గ్రామస్తులు పిల్లల మృతదేహాలను చూసి చలించిపోయారు.

## కన్న తండ్రిని హత్య చేసిన కొడుకు


- మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో ఘటన

**బలగం టీవి, మెదక్**

మానవత్వ విలువలు మరిచి జల్సాలకు అలవాటు పడిన యువకుడు.. తన అవసరాల కోసం తండ్రి డబ్బులు ఇవ్వడంలేదన్న కోపంతో కన్న తండ్రినే ఓ కొడుకు హత్య చేశాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సీతానగర్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన లంగాడి లక్ష్మయ్య(48) వ్యవసాయంతో పాటు ఓ లైన్ మెన్ వద్ద విద్యుత్ పనుల కోసం సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య శేఖమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు శ్రీకాంత్ వివాహానికి, వ్యవసాయానికి కొంత అప్పులయ్యాయి. అంతేకాకుండా, శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడటంతో అప్పులు ఇంకా ఎక్కువయ్యాయి. దాంతో డబ్బుల విషయంలో శ్రీకాంత్‌కు, అతని తండ్రి లక్ష్మయ్యకు తరచూ గొడవలు జరుగుతుండేవి. డబ్బులు ఇవ్వకపోతే చంపుతా అంటూ తరచూ శ్రీకాంత్ తండ్రిని బెదిరించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా లక్ష్మయ్య ఇంటికి రాగానే శ్రీకాంత్ మళ్లీ డబ్బులు అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శ్రీకాంత్ ఆవేశంలో ముందుగా సుత్తితో తండ్రిపై దాడి చేయగా తల్లి శేఖమ్మ అతని వద్ద నుంచి సుత్తిని లాక్కోవడంతో శ్రీకాంత్ మళ్లీ అక్కడే ఉన్న కర్రతో లక్ష్మయ్య తలపై దాడి చేశాడు. దాంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలవడంతో వెంటనే కుటుంబీకులు మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. తన భర్త మృతికి కారణమైన కొడుకు శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య భార్య శేఖమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## యూపీలో 2.89 కోట్ల ఓట్లు తొలగింపు

- మరణాలు, వలసలు, డూప్లికేట్ ఓట్లే కారణం : ఎన్నికల సంఘం



**బలగం టీవి, లక్నో**

ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 2.89 కోట్ల ఓట్లను తొలగించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు యూపీకి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను తాజాగా విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం తొలగించిన ఓట్లలో 46 లక్షల ఓట్లు మరణించినవారివిగా గుర్తించారు. అలాగే 2.17 కోట్ల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు నిర్ధారించగా, మరో 25.47 లక్షల మంది వద్ద డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించారు.

తాజా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉన్నవారు లేదా తమ పేరు జాబితాలో లేకపోతే ఫిబ్రవరి 6 వరకు ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పించారు. ఫారం‌‑7, ఫారం‌‑8ల ద్వారా స్థానిక ఎన్నికల అధికారులకు అభ్యంతరాలు తెలుపవచ్చని పేర్కొన్నారు. అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది ఓటర్ల జాబితాను మార్చి 6న విడుదల చేసే అవకాశం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నవదీప్ రిన్వా మంగళవారం తెలిపారు. ఈ ముసాయిదా జాబితాను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు పంపించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇంతకుముందు యూపీలో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, తాజా ముసాయిదా జాబితా ప్రకారం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. అంటే దాదాపు 18.7 శాతం ఓట్లను తొలగించినట్లైంది. ఇదే విధంగా గతంలో తమిళనాడులో 15 శాతం, గుజరాత్‌లో 14.5 శాతం ఓట్లను 'సర్' ప్రక్రియ ద్వారా ఎన్నికల సంఘం తొలగించిన విషయం తెలిసిందే. గత ఏడాది కేంద్ర ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించింది. యూపీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇదిలా ఉండగా, 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. దొంగ ఓట్లను తొలగించే పేరుతో ఇండియా కూటమి గెలిచిన నియోజకవర్గాల్లోనే ఎక్కువగా ఓట్లను తొలగిస్తున్నారని ప్రతిపక్షలు ఆరోపిస్తున్నాయి.

## జనవరి 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న 2026-27 వార్షిక బడ్జెట్..?
- ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టేనా..?



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జనవరి 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. తొలిరోజు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న 2026-27 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. అయితే ఈ సారి ఫిబ్రవరి 1 ఆదివారం రావడంతో బడ్జెట్‌ను ప్రవేశపెడతారా లేదా అనేది ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

**ఆదివారం కూడా పార్లమెంట్**

అయితే, వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. 2016లో తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలూ ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13న ఆదివారం సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

**ఫిబ్రవరి 1వ తేదీనే ఎందుకు..?**

గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించుకునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తరువాత , మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమోదించేవారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది.

### మధ్యాహ్న భోజనం వికటించి

## 8 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- నిలకడగా ఆరోగ్య పరిస్థితి

**బలగం టీవి, కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెద బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం వికటించడంతో ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 54 మంది విద్యార్థులు చదువు తుండగా, ఆ రోజు 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనంగా తోటకూర, పెసరపప్పు వడ్డించగా, భోజనం చేసిన కొద్దిసేపటికే విద్యార్థులు ఒక్కొక్కరిగా కడుపు నొప్పి, ఛాతి నొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని వారు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మ తులసికి తెలియజేయడంతో వెంటనే స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. అంబులెన్సు సాయంతో విద్యార్థులను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆసుపత్రిని సందర్శించి బాధిత విద్యార్థులను పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన, మధ్యాహ్న భోజనం నమూనాలను ప్రయోగశాలకు పంపించి పరిశీలన అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆర్డీవో సూచించారు.

## డ్రగ్ ట్రాఫికింగ్ ఆరోపణలు ఖండించిన మదురో దంపతులు

- న్యూయార్క్ కోర్టులో వెనిజువెలా అధ్యక్షుడు మదురో, భార్య హాజరు



**బలగం టీవి, న్యూయార్క్**

ఆకస్మికంగా దాడులు చేసి తమ దేశానికి తీసుకొచ్చిన వెనిజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను, ఆయన భార్య సిలియాను అమెరికా ప్రభుత్వం సోమవారం న్యూయార్క్‌లోని మన్‌హటన్ ఫెడరల్ కోర్టులో హాజరుపరిచింది. డ్రగ్ ట్రాఫికింగ్, అక్రమ ఆయుధాల కలిగి ఉన్నారన్న ఆరోపణలపై జరిగిన విచారణలో మదురో దంపతులు తాము నిర్దోషులమని వాదించారు. డ్రగ్స్ రవాణాతో తమకు ఎలాంటి సంబంధం లేదని కోర్టుకు స్పష్టం చేశారు. మదురో, సిలియాపై నమోదైన కేసుల నేపథ్యంలో వారిని సోమవారం బ్రూక్లిన్ జైలు నుంచి మన్‌హటన్ ఫెడరల్ కోర్టుకు తరలించారు. ఉదయం 7 గంటల 15 నిమిషాలకు బ్రూక్లిన్ జైలు నుంచి సమీపంలోని క్రీడా మైదానంలో ఉన్న హెలికాప్టర్ వరకు తీసుళ్లి, అక్కడి నుంచి న్యూయార్క్ హార్బర్ మీదుగా మన్‌హటన్ హెలిప్యాడ్‌కు చేర్చారు. అనంతరం సాయుధ వాహనంలో కోర్టుకు తరలించారు.

నీలం రంగు జైలు దుస్తుల్లో మదురో దంపతులు కోర్టుకు హాజరయ్యారు. మధ్యాహ్నం ప్రారంభమైన విచారణకు ముందు సుదీర్ఘ న్యాయ ప్రక్రియ జరిగింది. విచారణ సందర్భంగా మదురో తనను బలవంతంగా బంధించి తీసుకొచ్చారని చెప్పే ప్రయత్నం చేయగా, న్యాయమూర్తి ఆయనను మధ్యలోనే అడ్డుకుని ఆరోపణలపై మాత్రమే స్పందించాలని సూచించారు.

తాను నిర్దోషినని, ఎలాంటి తప్పు చేయలేదని మదురో కోర్టుకు తెలిపారు. తాను గౌరవప్రదమైన వ్యక్తినని, తన దేశానికి అధ్యక్షుడినని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణాకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఆయన భార్య సిలియా కూడా తాను నిర్దోషినని వెల్లడించారు. మదురో దంపతులు స్పానిష్‌లో వాదనలు వినిపించగా, కోర్టు ట్రాన్స్‌లేటర్ వాటిని ఆంగ్లంలోకి అనువదించారు. వాదనలు విన్న అనంతరం కోర్టు విచారణను మార్చి నెలకు వాయిదా వేసింది.

అమెరికాలో సాధారణ పౌరులకు వర్తించే విచారణ విధానమే మదురో దంపతులకు కూడా వర్తిస్తుందని అధికారులు తెలిపారు. సార్వభౌమ దేశాధినేతగా మదురోకు అరెస్టు నుంచి రక్షణ ఉంటుందని ఆయన తరఫు న్యాయవాదులు పేర్కొంటూ, ఈ అంశాన్ని కోర్టులో వాదించనున్నట్లు తెలిపారు. ఈ విచారణ సందర్భంగా కోర్టు సమీపంలో కొందరు అమెరికా వ్యతిరేక నిరసనలకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు.

## రాజన్న ఆలయ విశ్రాంత ప్రధాన అర్చకులు అప్పాల భీమాశంకర్ మృతి పట్ల కేటీఆర్ సంతాపం..

- రాజన్న క్షేత్రానికి తీరని లోటు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు మరియు స్థానాచార్యులు శ్రీ అప్పాల భీమాశంకర్ మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సంతాపాన్ని తెలియజేశారు. రాజన్న ఆలయానికి ఆయన సేవలు మరువలేనివని, గతంలో తాను ఆలయాన్ని సందర్శించినప్పుడు దగ్గరుండి పూజ కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన మరణం రాజన్న భక్తులకు, వేములవాడ ప్రాంతానికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## సర్వే పరికరాలతో కచ్చితమైన కొలతల వివరాలు..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పెన్ టెక్స్ రోవర్స్ పరికరాలు ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అధునాతన పెన్ టెక్స్ రోవర్స్ సర్వే పరికరాలతో ఇండ్ల, స్థలాల కచ్చితమైన కొలతల వివరాలు అందుబాటులోకి వస్తాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. సర్వే అండ్ సెటిల్మెంట్ శాఖ హైదరాబాద్ నుంచి కేటాయించిన మూడు పెన్ టెక్స్ రోవర్స్ సర్వే పరికరాలు జిల్లాకు చేరుకోగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఇన్స్పెక్టర్ అఫ్ సర్వే శ్రీనివాస్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ మున్సిపల్ పరిధిలో నక్ష భూసర్వే కార్యక్రమం కింద పట్టణంలోని అన్ని గృహ, ఇతర అన్ని వివరాలను పెన్ టెక్స్ రోవర్స్ సర్వే పరికరాలతో కచ్చితమైన కొలతల వివరాలు నమోదు అవుతాయని వెల్లడించారు. దీంతో ప్రతి ఒక్క ఇంటి సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు ఈ పరికరం ద్వారా సర్వే చేస్తారని, ఆ వివరాలు శాటిలైట్ లో నమోదు అయి, కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇద్దరు డిప్యూటీ సర్వే ఇన్స్పెక్టర్స్ వెంకటాచారి, వెంకటరత్నం, ఐదుగురు సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లకు పెన్ టెక్స్ రోవర్స్ సర్వే పరికరాలపై కంపెనీ బాధ్యుడు మూర్తి శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్ ఏఓ రాం రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో ఘనంగా రోడ్డు భద్రతా మాస ఉత్సవాలు..

- విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రోడ్డు భద్రతా మాస ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి (ఋఉ) లక్ష్మణ్ ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని మూడు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మరియు కాకతీయ హైస్కూల్ వేదికలుగా ఈ పోటీలు జరిగాయి. వ్యాసరచన పోటీలు.. "రోడ్డు ప్రమాదాల నివారణ – వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో మొత్తం 12 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలు.. "రోడ్డు రవాణా ప్రమాదాలు" అనే అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీలో 10 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్ణయించారు. ఈ పోటీలకు రిటైర్డ్ అధ్యాపకులు మద్దికుంట లక్ష్మణ్, పిల్లి ధర్మయ్యలతో పాటు అధ్యాపకులు సిహెచ్. వెంకటరమణ మరియు బి. వేణుగోపాల్ రావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా శాఖ సభ్యులు సంగీతం శ్రీనాథ్, జిల్లా సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు (ఽఽవీఎక్స్మీ) బేతి రజని, పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ సిబ్బంది, కానిస్టేబుళ్లు సౌమ్య, రమ్య, ప్రశాంత్ మరియు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**




ఇల్లంతకుంట మండలంలోని డిడిఎఫ్ డైరీ క్యాలెండర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాచారంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి డిటిఎఫ్ మండల అధ్యక్షులు తూముకుంట నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా డిటిఎఫ్ మండల అధ్యక్షులు తూముకుంట నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పి ఆర్ సి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డి ఏ లను వెంటనే విడుదల చేయాలి అని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీను, ఆనంద్, శ్రీనివాస్, సురేష్, సంజీవ్, శ్రవణ్ లు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో 280 ఇండ్లు ప్రారంభానికి సిద్ధం చేయాలి..

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- ప్రతి ఎంపీడీఓ రోజూ 10 ఇండ్ల పురోగతిని పరిశీలించాలి, లబ్దిదారులతో సమావేశం కావాలి
- జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో సమావేశం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశమయ్యారు.

ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 7,408 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు. 5,571 ముగ్గు పోశామని, 4,544 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 3,193 ఇండ్లు గోడల లెవెల్ లో, 2,370 స్లాబ్ లెవెల్ లో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారితో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

ప్రతి ఎంపీడీఓ ప్రతి రోజూ 10 ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదా రులతో సమావేశం కావాలని సూచించారు. తాను ఏదో ఒక మండలంలో ఆకస్మిక తనిఖీ చేస్తానని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. లబ్దిదారులకు ఇటుకులు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. సరైన ధరకు వచ్చేలా హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు, ఫోన్ నంబర్లు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. లబ్దిదారుల నుంచి ఇంటి నిర్మాణ పనుల అడ్వాన్స్ తీసుకొని వెళ్ళిపోయిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లపై వచ్చిన దరఖాస్తులను ఆయా ఎంపీడీఓలు పరిష్కరించాలని ఆదేశించారు.

**అధికారులకు అభినందన..**

బోయినపల్లి మండలంలో 23 ఇందిరమ్మ ఇండ్లు, తంగళ్ళపల్లి మండలంలో 14 పూర్తి చేసిన ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులను అభినందించారు. మిగితా మండలాల వారు ప్రణాళిక ప్రకారం ఇండ్లను పూర్తి చేయించాలని సూచించారు. పూర్తి అయిన ఇండ్లను గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని పిలుపు నిచ్చారు. రానున్న నెల రోజుల్లో జిల్లాలో మొత్తం 280 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, మండల ప్రత్యేక అధికారులు గీత, అఫ్జల్ బేగం, లక్ష్మరాజం, రవీందర్ రెడ్డి, హనుమంతు, షరీఫుద్దీన్, రామకృష్ణ, క్రాంతి, నజీర్ అహ్మద్, ఎంపీడీఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతర లక్ష్యంగా సిరిసిల్ల ఆర్టీసీ డిపో సన్నద్ధం

- ఆర్టీసీ డిపోలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరఉ2026ను పురస్కరించుకుని, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ దీ. రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతి రెడ్డి మరియు సిరిసిల్ల డిపో మేనేజర్ ఏ.ప్రకాశ రావు ల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. జాతరను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, క్యూ లైన్ల నిర్వహణ మరియు తాగునీటి సౌకర్యాలపై చర్చించారు. ప్రయాణం సురక్షితంగా సాగేలా డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలు, వాహనాల కండిషన్ మరియు భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక సూచనలు చేశారు.జాతర విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు కల్పించవలసిన వసతి, భోజన సదుపాయాలు మరియు ఇతర సౌకర్యాలపై మేనేజ్మెంట్ సానుకూలంగా స్పందించింది. మేడారం వెళ్లే భక్తులకు సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు మరియు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.







## కోనరావుపేటలో చట్టాలపై అవగాహన సదస్సు..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఋబూూ పి.లక్ష్మణాచారి సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు గారు పాల్గొని విద్యార్థులకు చట్టాలు, పిల్లల హక్కులు, బాలపర్యవేక్షణ, బాల్య వివాహాలు, బాలల హక్కుల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వం గాలి పటాలకు ఉపయోగించే చైనా మాంజాపై నిషేధం విధించిందని, కాటన్ దారాలు మాత్రమే వాడాలని అన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, కుంట శ్రీనివాస్, తవుటు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడెపు రాజేశం, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు మరియు న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు రహదారి భద్రత కార్యాచరణఉ2026పై రూపొందించిన వాల్ పోస్టర్లను కొనరావుపేట బస్ స్టాండ్ ఆవరణలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రహదారి భద్రతా నియమాలు పాటించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు రహదారి భద్రతకు సహకరించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు.

# బెల్ట్ షాప్ వేలంతో ఆందోళనలో ఊరు..!

- ఆలయం వద్ద వేలం
- బెల్ట్ షాపులకు వేలం ఏమిటంటూ విమర్శలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇటీవలే నూతనంగా పలు గ్రామాల్లో సర్పంచ్ లు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. రిజిస్టర్‌లో తొలి సంతకం చేసిన కొందరు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సాధిస్తూ ముందుకు వెళ్తున్నారు. కొంతమంది సర్పంచ్లు గ్రామాల్లో మద్యపానానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తూ మద్యపాన రహిత తీర్చిదిద్దడానికి ముందడుగు వేస్తున్నారు. అందుకు భిన్నంగా రాజన్న సిరిసిల్ల



జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో బెల్ట్ షాపు ను బహిరంగ వేలం నిర్వహించడం చర్చనీయంగా మారింది. మద్యం విక్రయాలు ఇప్పుడు.. ఏకంగా బాహాటంగా విక్రయించుకోవడానికి అవకాశం కల్పించే తాజా చర్యలు ఉన్నట్లుగా విమర్శలొస్తున్నాయి. గ్రామంలో బెల్ట్ షాపు ఓపెన్ చేసేందుకు బహిరంగ వేలం నిర్వహించినట్లుగా తెలుస్తోంది. ఆ మేరకు గ్రామంలోని నడిబొడ్డున ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద వేలం పాడగా, వేలం పాటలో చివరకు ఓ వ్యక్తి రూ. 3 లక్షల 57 వేలకు చేజిక్కించుకున్నట్లుగా అత్యంత విశ్వసనీయ సమాచారం. దీనిపై గ్రామస్తుల నుంచి ఆందోళన వ్యక్తం అవుతున్నా, వారు బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఎవరైనా ముందుకొస్తే ఇబ్బందులకు గురవుతామన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. మద్యం నిషేధాన్ని ప్రోత్సహించి.. అందుకు అనువైన చర్యలు తీసుకొని గ్రామాన్ని ఆదర్శంగా నిలుపాల్సింది పోయి.. బెల్ట్ షాపులకు వేలం పాడడం ఏమిటంటూ.. సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# హోం గార్డ్ దేవయ్య కుటుంబానికి అండగా ఉంటాం..

- జిల్లా పోలీస్ శాఖలో 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న దేవయ్య మరణం తీరనిలోటు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- అంత్యక్రియలలో పాల్గొని, పార్థివ దేహానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు దేవయ్య కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హామీ ఇచ్చారు. మంగళవారం దేవయ్య అంత్యక్రియలలో పాల్గొన్న ఎస్పీ, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పోలీస్ శాఖలో గత 26 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తున్న దేవయ్య, సోమవారం తన విధులు ముగిం చుకుని ఇంటికి వెళ్తుండగా సిరిసిల్ల బైపాస్ ప్రాంతంలోని క్రషర్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దేవయ్యకు



భార్య మరియు నలుగురు పిల్లలు ఉన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేవయ్య మరణం పోలీస్ శాఖకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. 26 ఏళ్ల పాటు క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఆయన సేవలను కొనియాడారు. “దేవయ్య కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉండి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు నాగేశ్వరరావు, రవి, మొగిలి, ఆర్.ఐ కు మధుకర్,యాదగిరి, రమేష్, ఎస్.ఐ ఉపేంద్రచారి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# తంగళ్ళపల్లి ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆసాని శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవం



**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఎట్టకేలకు బిఆర్ఎస్ (దీక్ష్మా) పార్టీని వరించింది. తీవ్ర ఉత్కంఠ మధ్య జరిగిన ఈ ఎన్నికలో మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షనిగా ఆసాని శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తంగళ్ళపల్లి మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షన్ని ఎన్నుకునే క్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన ఉపసర్పంచులు రెండు క్యాంపులు నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఉపసర్పంచుల క్యాంపులో ఆసాని శ్రీకాంత్ రెడ్డికి మద్దతుగా 18 మంది సానుకూలంగా మద్దతు తెలిపారు. జీర్ణించుకోలేని కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపసర్పంచులు బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న క్యాంపులో వద్దకు చేరుకొని వాగ్వివాదానికి దిగారు.తంగళ్ళపల్లి మండలంలోని 30 గ్రామాలకు గాను 18 మంది ఉపసర్పంచ్ లు ఆసాని శ్రీకాంత్ రెడ్డి కి మద్దతు తెలిపి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరికొందరు ఉపసర్పంచులు ఈ ఎన్నిక చెల్లదంటూ వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని అక్కడనుండి పంపించి వేశారు.18 మంది ఉపసర్పంచులు ఏకగ్రీవంగా ఆసాని శ్రీకాంత్ రెడ్డి ని ఎన్నుకున్నట్లు ప్రకటించడంతో తంగళ్ళపల్లి మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షనిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా ఆసాని శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొత్త సంతోష్, ఉపాధ్యక్షులుగా జూపల్లి అజయ్ రావు, వేముల శ్రీకాంత్, తాటిపల్లి దివ్య, భీమరి లక్ష్మ, కార్యదర్శి గోట్ల ఎల్లయ్య, జక్కుల రవి, కోశాధికారి ఎస్.కే ఇమామం, ఆర్గనైజర్ పొన్నాల నరసయ్య, కోసిని శ్రీధర్, గోగు అనిల్, గౌరవ అధ్యక్షులు పయ్యావుల బాలయ్య, సలహాదారులు మొగిలి కర్ణాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఆసాని శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షనిగా ఎన్నుకున్నందుకు ఉపసర్పంచ్ లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సందర్భంగా ఆయన అన్నారు.

# డీఎస్పీని సత్కరించిన సీనియర్ సిటిజన్ అసోసియేషన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగేంద్ర చారిని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య, జిల్లా అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య ఆధ్వర్యంలో డిఎస్పికి శాలువా కప్పి, అసోసియేషన్ డైరీ మరియు క్యాలెండర్‌ను అందజేశారు. సీనియర్ సిటిజన్లకు సంబంధించిన మొండి కేసుల పరిష్కారంలో సహకరించాలని, వృద్ధులను ఇబ్బంది పెట్టేవారికి తగిన గుణపాఠం చెప్పాలని కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా కోరారు. దీనిపై డిఎస్పి నాగేంద్ర చారి సానుకూలంగా స్పందిస్తూ.. “కన్నతల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం” అని హామీ ఇచ్చారు. వృద్ధుల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య,అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి కోడం నారాయణ, కోశాధికారి దొంత దేవదాసు, ఉపాధ్యక్షులు శ్రీగాద మైసయ్య, ఎనుగుల ఎల్లయ్య, అంకారపు జ్ఞానోభ, గజ్జల్లి రామచంద్రం, గుడ్ల శ్రీధర్, ఇరుకుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# తంగళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వైద్యారోగ్య శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అన్ని వ్యాధులపై అవగాహన కల్పించాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, ఎన్.సీ.డీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీ. హెచ్.సీ)ని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఆవరణలో పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏ.ఎన్.ఎం. లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణీల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. ఎన్.సీ.డీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందు గానే వ్యాధి లక్షణాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు. రిజిస్టర్ లు అన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని వైద్యాధికారికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.



# వెంకంపేట ప్రభుత్వ పాఠశాలకు అర్బన్ బ్యాంకు చేయూత

- ప్లాంట్, ఫ్యాన్లు విరాళం..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

విద్యార్థుల సౌకర్యార్థం సామాజిక బాధ్యతగా సిరిసిల్ల అర్బన్ బ్యాంకు వారు వెంకంపేట ఉన్నత పాఠశాలకు భారీ విరాళాన్ని అందజేశారు. సుమారు 30 వేల రూపాయల విలువైన క్షుఉ (వాటర్ ప్యూరిఫైయర్) ప్లాంట్‌ను, అలాగే 15 వేల రూపాయల విలువ గల ఐదు ఫ్యాన్లను పాఠశాలకు అందజేశారు. మంగళవారం రోజున పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి పాల్గొని, వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాపెల్లి లక్ష్మనారాయణ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో క్షుఉ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. తరగతి గదులలో విద్యార్థులు సౌకర్యవంతంగా విద్యను అభ్యసించడానికి ఫ్యాన్లను అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన అర్బన్ బ్యాంకు యాజమాన్యానికి ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూస రఘుపతి, ఉపాధ్యాయ బృందం మరియు బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# రిటైర్ ఉద్యోగుల అరెస్ట్ అమానుషం

- ఉద్యోగ సంఘాల మాజీ చైర్మన్ దేవీప్రసాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

రిటైర్ అయిన తరువాత తమకు రావాల్సిన పెన్షన్ బకాయిలు తాము దాచుకున్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ఆవేదన చెందిన పెన్షనర్స్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి తమ కష్టాలు చెప్పుకోవాలని వస్తే పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మార్చి 24 నుండి నేటి వరకు రిటైర్ మెంట్ అయిన 20503 మంది ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం వేధించడం దారుణం, ప్రభుత్వం 4500 కోట్లు విడుదల చేశామని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, గత అయిదు నెలలుగా ప్రభుత్వం రెగ్యులర్ గా 700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చి కేవలం 400 కోట్లు కూడా పెన్షనర్స్ కు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటివరకు 42 మంది పెన్షనర్స్ తమ డబ్బులు రావనే ఆవేదనతో మరణించడం బాధాకరం. రావలసిన 5 డి ఏ విడుతల కోసం, పి ఆర్ సి అమలు కోసం, రిటైర్ మెంట్ బకాయిల కోసం పెన్షనర్స్ ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో స్పందన లేకపోవడం వలన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. చివరకు వివిధ జబ్బులతో బాధపడుతున్న పెన్షనర్స్ కు వైద్యం కూడా అందడం లేదు,పెన్షనర్స్ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయండి అరెస్ట్ లతో ఆందోళనలు ఆపలేరని మరింత తీవ్ర ఆందోళనలు తప్పవని హెచ్చారించారు.



## టీపిటీయూ నూతన డైరీ ఆవిష్కరణ

- **కేటీఆర్, జగదీష్ రెడ్డిల చేతుల మీదుగా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపిటీయూ) నూతన డైరీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిలు బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. టీపిటీయూ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, వ్యవస్థాపకులతో కలిసి డైరీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీపిటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్, వ్యవస్థాపకులు వేణుగోపాల స్వామి, జక్టో మాజీ అధ్యక్షులు జి.భుజంగరావు, జి.మాధవరెడ్డి, సోమ్లా నాయక్, వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.




## బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బాల వివాహ ముక్త్ భారత్ లో భాగంగా మంగళవారం రోజున సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా మహిళా శిశు సంక్షమ శాఖ సాధికారికత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షమ అధికారి ఈ లక్ష్మరాజం హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలికల విద్యకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. బాలికల రక్షణ కోసం షీ టీం లు, యంగ్ ఇండియా స్కూల్స్, గృహజ్యోతి, ఉచిత విద్యుత్తు, ఉచిత సిలిండర్, ఉచిత బస్సు రవాణా సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు లాంటి అనేక పథకాలను మహిళల పేర్ల మీద ఇస్తున్నారని వివరించారు. అలాగే బాలికలు చదువుకుని ఈ సమయంలో ఉన్నత లక్ష్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు రకాలైన చట్టాలు మహిళల కోసం ప్రత్యేకించబడిన చట్టాలు వాటి అమలు గురించి వివరించారు. అలాగే బాలికల కోసం ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో జీవితంలో ఉన్నత లక్ష్యలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి స్వల్పకాలిక లక్ష్యలు దీర్ఘకాలిక లక్ష్యలుగా విభజించుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారికత కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్జీవో సంస్థల ప్రతినిధులు జెండర్ స్పెషలిస్ట్ దేవిక పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ జోలికి రావొద్దు!

- **ఇది చరిత్రను ఖూనీ చేయడమే..**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు**



**బలగం టీవీ, హైదరాబాద్:**

"పునర్వ్యవస్థీకరణ" పేరుతో సికింద్రాబాద్ నగరం యొక్క 200 ఏళ్ల ఘన చరిత్రను చెరిపేయాలని చూస్తే ప్రజలు సహించబోరని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు హెచ్చరించారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తూ ఆయన ఈ రోజు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.

**200 ఏళ్ల సజీవ చరిత్రపై దాడి..**

సికింద్రాబాద్ కేవలం ఒక పిన్‌కోడ్ లేదా బ్యూరోక్రాటిక్ బ్లాక్ కాదని, అది 1806లో పురుడుపోసుకుని, తనదైన విశిష్ట సంస్కృతితో ఎదిగిన సజీవ నగరమని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 'ట్విన్ సిటీ'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన నగరాన్ని పాలనా సౌలభ్యం పేరుతో తుడిచివేయాలని చూడటం "సాంస్కృతిక విధ్వంసం" అని మండిపడ్డారు. "సికింద్రాబాద్‌ను మ్యాప్‌పై గీసి చెరిపేయగల గీతలా చూడటం చరిత్రపై, ప్రజల ఆత్మగౌరవంపై జరిగిన దాడి. ఇది పరిపాలనా సంస్కరణ కాదు ఉ ఇది చరిత్ర హత్య," అని డా. శ్రవణ్ వ్యాఖ్యానించారు.

**ఏకపక్ష నిర్ణయాలు నియంతృత్వ ధోరణి..**

మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచినంత మాత్రాన, సికింద్రాబాద్ పౌర అస్తిత్వాన్ని మార్చేసే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. మల్కాజిగిరి పేరుతో ఒక ప్రత్యేక ఎం.సి.హెచ్ (వీజు) ఏర్పాటు చేసి, చారిత్రాత్మక సికింద్రాబాద్ సరిహద్దులను అందులో బలవంతంగా విలీనం చేయడం ఏకపక్షమని, ఇది నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు.

'ప్రజాస్వామ్య విరుద్ధం.. ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా చేస్తున్న ఈ మార్పులు అధికార దుర్వినియోగమే. గుర్తింపు చోరీ.. తరతరాల జ్ఞాపకాలను, పౌర గుర్తింపును చెరిపేయడం ప్రజల మనసులను గాయపరచడమే' అని అన్నారు.

**ప్రజలు ప్రతిఘటిస్తారు చరిత్ర తీర్పు చెబుతుంది:**

సికింద్రాబాద్ పేరును, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని డా. శ్రవణ్ హెచ్చరించారు. ఇది కేవలం స్థానిక సమస్య కాదని, మన అస్తిత్వం కోసం జరుగుతున్న పోరాటమని ఆయన పేర్కొన్నారు. "సికింద్రాబాద్ పేరును చెరిపేయాలనుకుంటే, ప్రజల ఆత్మగౌరవాన్నే చెరిపేయాలని చూస్తున్నట్లే. ప్రభుత్వం ఈ ప్రమాదకరమైన ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలి. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు," అని డా. శ్రవణ్ దాసోజు హెచ్చరించారు.

## ఓటర్ జాబితాలో అభ్యంతరాలపై తెలియజేయాలి..

- **జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో విడుదల చేసిన ఓటర్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ సాయంత్రం 05.00 గంటల లోగా తెలియజేయాలని చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఇటీవల విడుదల చేసిన ఓటర్ జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గత నెల డిసెంబర్ 30వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఓటర్ జాబితాను సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో డౌన్ లోడ్ చేసారని, దానిని గత నెల 31వ తేదీన వార్డుల వారీగా సిద్ధం చేశారని, జనవరి 01వ తేదీన రెండు మున్సిపల్ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై జాబితా అందుబాటులో పెట్టామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో జిల్లాలోని రెండు మున్సిపల్ కార్యాలయాల్లో ఈ నెల 05 వ తేదీన మీటింగ్ పెట్టామని వివరించారు.

సిరిసిల్లలో మొత్తం 39 వార్డులు ఉన్నాయని, 39,942 మంది పురుష ఓటర్లు, 42,011 మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉన్నారని, వేములవాడలో మొత్తం 28 వార్డులు 19,580 మంది పురుష ఓటర్లు, 21,279 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 18 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 1,22,836 మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు.ఓటర్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ల్లో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 05.00 గంటల లోగా తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాలను ఆయా మున్సిపల్ కమిషనర్లు సీల్డ్ కవర్లో ఈఆర్ఓలకు పంపించాలని ఆదేశించారు. ఈ నెల 10 వ తేదీన తుది ఓటర్ జాబితా విడుదల చేస్తామని ఆమె వెల్లడించారు. పలు పార్టీల ప్రతినిధులు డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి ఓటర్ల తొలగింపు, వార్డులో సీరియల్ నంబర్ వారిగా ఓటర్ జాబితా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సూర దేవరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, బీఆర్ఎస్ ప్రతినిధి జిందం చక్రపాణి, బీఎస్పీ ప్రతినిధి ఏ రమేష్, టీడీపీ ప్రతినిధి తీగల శేఖర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, డీ టీ సీ పీ ఓ అన్సార్ పాల్గొన్నారు.

## 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును ఆపడమేంటి



- **బీఆర్ఎస్ మాజీ మంత్రులు**
- **జూరాల ప్రాజెక్టు సందర్శన**

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90 శాతం పూర్తయ్యాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును ఆపడమేంటని ఆయన ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయకుండానే బీఆర్ఎస్ ప్రభుత్వంపై అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అనేక కేసులు వేసి ఏపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సహకరించారని ఆరోపించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాల నుంచి పాలమూరుకు నీళ్లు అంటేనే పెద్ద కుట్ర అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తప్పుల తడకగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పీపీటీ ఇచ్చారని విమర్శించారు. హరీశ్‌రావు పవర్‌ఫుల్ ప్రజెంటేషన్‌తో ఉత్తమ్‌కు పీపీటీతో సమాధానమిచ్చారని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. కృష్ణా నది నీళ్లను తెలంగాణకు దక్కకుండా చేసేందుకే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.అప్పుడైనా.. ఇప్పుడైనా కృష్ణా నీళ్లు పాలమూరుకు రాకుండా చేస్తున్నారని అన్నారు. నిజాం కాలంలోనే కృష్ణా నీటి కోసం అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని తెలిపారు. తుంగభద్రలో నీటి పంపకాలపై 65 టీఎంసీల కోసం 1944లోనే ఒప్పందాలు జరిగాయని అన్నారు. భీమా ప్రాజెక్టును యాదగిరి జిల్లాలో మొదట ప్రతిపాదించారని, ఆలమట్టిని కూడా నిజాం కాలంలోనే ప్రతిపాదించారని తెలిపారు. పాలమూరుకు 174 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిజాం పలు ప్రాజెక్టులను నిర్మించారని పేర్కొన్నారు. కానీ నిజాం కాలంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులను నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. అప్పటి నుంచే తెలంగాణకు అన్యాయం చేయడం ప్రారంభమైందని తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర కట్టాల్సిన శ్రీశైలం ప్రాజెక్టును 86 కిలోమీటర్ల కింద కట్టారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే గ్రావిటీ ద్వారా పాలమూరుకు నీళ్లు వచ్చేవని పేర్కొన్నారు. జల విద్యుత్ కోసం కట్టిన శ్రీశైలం నుంచి తెలుగుగంగ పేరుతో నీటిని తరలించారని అన్నారు. తెలుగుగంగ ద్వారా కడప, నెల్లూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని పేర్కొన్నారు. కృష్ణా నదిని మొత్తం మలుపుకు పోయేలా పోతిరెడ్డిపాడును చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం దరిదాపుల్లోకి రాకుండా చేసే కుట్ర అప్పుడు జరిగిందని.. ఇప్పుడు కూడా జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ లేవనెత్తిన అంశం అసాధ్యమని తెలిపారు.

**రైతులతో కలిసి పోరాటం చేస్తాం: మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్**

స్వల్ప నీటి లభ్యత ఉన్న జూరాల ప్రాజెక్టును కాకుండా, సమృద్ధిగా నీరు లభించే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను పాలమూరుఉరంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి మూలంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ నిర్ణయం పాలమూరు ప్రాంత రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదని ఆయన స్పష్టం చేశారు. బేషజాలకు పోకుండా పాలమూరుఉరంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన 10 శాతం పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే 90 శాతం పూర్తైన ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం ద్వారా పాలమూరు రైతుల ఆశలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కేవలం 45 టీఎంసీల నీటికి మాత్రమే పరిమితమైతే, ఇప్పటికే నిర్మించిన ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రాంతానికి న్యాయం జరగాలంటే పూర్తి స్థాయిలో నీటి కేటాయింపులు చేసి, ఎత్తిపోతల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

**జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోవడం అసాధ్యం : లక్ష్మారెడ్డి**

యాసంగి సీజన్‌లో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చిన విషయాన్ని మాజీ మంత్రి లక్ష్మరెడ్డి గుర్తు చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జూరాల నుంచి నీటిని ఎత్తిపోవడం పూర్తిగా అసాధ్యమని స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని విమర్శిం చారు. అవగాహన లేకుండా మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోతారని ప్రశ్నించిన ఆయన, వాస్తవ పరిస్థితులను గమనించకుండా కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు.

కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అవుతుందని విమర్శించారు. ఈ ప్రాజెక్టుతో ప్రజాధనం కచ్చితంగా వృథ అవుతుందని అన్నారు. కేసీఆర్ రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు డిజైన్‌ను పక్కనపెట్టి, దాన్ని పడావు పెట్టడం సరికాదని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకపోతే నిపుణులతో చర్చించి తెలుసుకోవాలని సూచించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదేనని విమర్శించారు. పాలమూరుఉరంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఆరు నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. చంద్రబాబుకు చెప్పి రాయలసీమ ప్రాజెక్టును ఆపించానని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షగా చెప్పిన వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండించిందని గుర్తు చేశారు. జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ ఏర్పాటు చేస్తే ఒక్క చుక్క నీరు కూడా రాదని, ఎన్ని రోజులు పంపింగ్ చేసినా ప్రయోజనం ఉండదని లక్ష్మరెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు జరుగుతున్నాయని ఆరోపిం చారు. ఈ విషయంపై ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.